క్లుప్తంగా

నేడు కంటి వైద్య శిబిరం

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డా.రాజశేఖర్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మురళి తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొనే వారిని పరీక్షించి కంటి శుక్లాలను తొలగించేందుకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని చిన్నంబావి, పాన్‌గల్, వీపనగండ్ల మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఆపరేషన్ చేయించుకునేవారు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు తీసుకొని రావాలన్నారు. వారికి పాలమూరులోని వెనుగొండ కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని వారు తెలిపారు.

సమయపాలన పాటించాలి



పాన్‌గల్: విద్యార్థులు, ఉపాధ్యాయులు తప్పక సమయపాలన పాటించాలని ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను వివరిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీరాశేఖరచారి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

28న సర్వసభ్య సమావేశం

ఆత్మకూర్: ఎంపీపీ బంగారు శ్రీనివాసులు అధ్యక్షతన ఆత్మకూర్ మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుజాత తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, తాగు, సాగునీరు, విద్యుత్, పౌర సరఫరాలు, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఐసీడీఎస్, సెర్ప్, ఉపాధిహామీ, పశువైద్యం, ఆబ్కారీ, హార్టీకల్చర్, తదితర శాఖల కార్యకలాపాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరుగుతుందన్నారు. సమావేశానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, ఆయాశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



వనపర్తిటౌన్: ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. బైపీసీ, ఎంపీసీ, సీఈసీలో అధిక మార్కులు, రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, మధుసూదన్‌గుప్త, కళాశాల డైరెక్టర్ శాలువ, బొకేతో ఘనంగా సన్మానించారు. బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో పి.ప్రవంతి 438, యశశ్రీ 438మార్కులతో స్టేట్ ఫస్ట్, సుమయ్యానాజీన్ 437 స్టేట్ సెకండ్, షాహిస్త తహినియత్ 436, బి.శిరీష 436తో స్టేట్ థర్డ్, ఎస్.హన్సిక 435, సైబ సబ్రీన్ 435, శిరీష 435తో స్టేట్ 4వ ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. అదేవిధంగా ఎంపీసీలో డి.జాహ్నవి 468, రాజు 467, సోని 466, తనూజ 465, నర్మద 462, హర్షిత్ 461, భవాని 460, సీఈసీలో ఇందు 475, చందు 463 మార్కులు సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పి.జగదీశ్వర్, వరప్రసాద్‌రావు, నాగేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు



పాన్‌గల్: ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలైన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బుసిరెడ్డిపల్లికి చెందిన కొమారి లక్ష్మీనారాయణ వ్యవసాయ పొలానికి వెళ్తున్న క్రమంలో గ్రామ బొల్లిగట్టు చెరువు కట్టమీద ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తాపడటంతో డ్రైవర్ లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

చెరువు కట్ట రోడ్డును విస్తరించాలి

గ్రామ సమీపంలో ఉన్న బొల్లిగట్టు చెరువు కట్టపై సింగిల్ రోడ్డు ఉండడంతో ఒక వాహనం ఎదురుగా వస్తే మరో వాహనం వెళ్లడం ఇబ్బందిగా మారడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు వాపోయారు. దీంతో మంత్రి జూపల్లి స్పందించి రోడ్డును విస్తరించి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల నాయకులు సూర్యవంశం రాము డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురైన ట్రాక్టర్ డ్రైవర్‌ను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు.

కానరాని 'పల్లెవెలుగు'




బస్సు సౌకర్యం లేక గౌరిదేవిపల్లి నుంచి నాగపూర్‌కు నడిచి వెళ్తున్న మహిళ (ఫైల్), కేశంపేట నుంచి ఏదుట్లకు నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులు (ఫైల్)

- ఏళ్లు గడుస్తున్నా కాలినడకే దిక్కు
- బస్సు సౌకర్యం కల్పించాలని వినతులు

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో కొన్ని గ్రామాలకు ఇప్పటికీ బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో సమీపంలోని ప్రధాన రోడ్డు వద్దకు వచ్చి బస్సులను ఎక్కుతున్నారు. విద్యార్థుల ఇబ్బందులు అయితే వర్ణనాతీతం. కొన్ని గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉదయం సాయంత్రం కలిసి 10 కి.మీ. దూరం నడుస్తున్న పరిస్థితులు ఉన్నాయి. విద్యాసంస్థలు పునఃప్రారంభమయిన నేపథ్యంలో విద్యార్థులకు సమయపాలన ప్రకారం బస్సు సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి

ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో వనపర్తి నుంచి నర్సింగాయపల్లి, తాడిపర్తి, గోపాల్‌పేట, బుద్దారం, ఏదుట్ల, చెన్నారం, ఏదుల, రేవల్లి, నాగపూర్, శానాయిపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం ఉంది. కానీ మున్ననూరు, తిర్మలాపూర్‌కు, తాడిపర్తి నుంచి చెన్నూరు, గోపాల్‌పేట నుంచి చెన్నూరు గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఎన్నికల సమయం వరకు పొలికెపాడు గ్రామానికి ఉదయం తొమ్మిది గంటలకు, సాయంత్రం ఐదు గంటలకు విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం బస్సు నడిచేది.. కానీ ప్రస్తుతం పొలికెపాడుకు సైతం బస్సు బంద్ చేశారు. చాకల్‌పల్లికి కొన్నేళ్ల క్రితం బస్సు నడిచినా.. ప్రస్తుతం రవాణా సౌకర్యం లేదు. కేశంపేట, కేశంపేట పాతతండా, కొత్తతండా, తల్పునూరు, గౌరిదేవిపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఏళ్లుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలు, కాలినడకన పిల్లలను బడికి పంపడం ఇష్టంలేక కొన్ని సందర్భాల్లో స్కూలు బంద్ చేయిస్తున్నారు. గతేడాది చెన్నూరుకు చెందిన కళాశాల విద్యార్థుల ఇబ్బందులు గమనించిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఎనిమిది మంది విద్యార్థులకు సొంతఖర్చుతో సైకిళ్లు కొనిచ్చారు. ప్రజలు, విద్యార్థుల సమస్యలను గుర్తించి ప్రజాప్రతినిధులు, అధికారులు బస్సు సౌకర్యం లేని గ్రామాలకు గుర్తించి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థుల అవస్థలు చెప్పలేం



పొలికెపాడుకు ఎన్నికలు ముగిసిన తర్వాత సుమారు నెల రోజులు బస్సు వచ్చింది. కానీ ఆ తర్వాత మా గ్రామానికి బస్సు రావడం లేదు. దీంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోల కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. కొన్నిసార్లు విద్యార్థులు కిలోల బరువు ఉండే బ్యాగులు మోస్తూనే నడుచుకుంటూ వెళ్తున్నారు. మా గ్రామానికి మళ్లీ బస్సుసౌకర్యం కల్పించండి.

– శివ, పొలికెపాడు

బస్సులు పునరుద్ధరిస్తాం

సుమారు మూడు నెలల క్రితమే వనపర్తి డిపోకు 26 బస్సులు కావాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. ఇప్పటికి మూడు బస్సులు వచ్చాయి. మిగతావి రావాల్సి ఉంది. విద్యార్థులు పాఠశాల, కళాశాలకు వెళ్లే సమయానని అనుగుణంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయిస్తాం.

– వేణుగోపాల్, వనపర్తి డిపో మేనేజర్

బాధిత కుటుంబాలకు పరామర్శ



అయ్యవారిపల్లిలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ



వనపర్తిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న బాలయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి పరామర్శించారు.అదేవిధంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్, సమన్వయకర్త లక్కాకుల సతీష్, కౌన్సిలర్ సత్యమ్మ, రవి తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఎమ్మెల్యే మేఘారెడ్డి తరుపున రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ద్వారపోగు వెంకటేష్, బొంబాయి మన్నెంకొండ, శరవంద, గజ్జల రాజు, సురేందర్, గంధం మదన్, నాగరాజు, బాలరాజు తదితరులు ఉన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి పద్మనాభం కు ఇటీవల గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, ఆపరేషన్ చేయించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి సోమవారం ఆస్పత్రికి వెళ్లి పద్మనాభం ను పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన మినిగ శివశంకర్‌నాయుడు హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆయన అంత్యక్రియలు స్వగ్రామం అయిన లక్ష్మీపల్లిలో నిర్వహించగా.. కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి, కృష్ణప్రసాద్‌యాదవ్, తేజారెడ్డి, బిచ్చన్న తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని కంచిరావుపల్లికి చెందిన ఉషాన్ అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలో హమాలి రామచంద్రయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఒక్కొక్క కుటుంబానికి రూ. 5వేల ఆర్థికసాయం పంపించారు. కార్యక్రమంలో శ్రీహరిరాజు, వహీద్, రాజవర్ధన్, వెంకటేష్, భాస్కర్, గంధం రాముడు, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి: మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన వేణుగౌడ్ పెబ్బేరు మండలంలోని సూగూరులో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఆయనకు భార్యతో పాటు ఐదు నెలల కుమార్తె ఉంది. ఇంటికి పెద్దదిక్కును కోల్పోయిన బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని లారీ ఓనర్ మహేశ్వరెడ్డిని స్థానిక ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ కోరడంతో.. ఆయన రూ.రెండు లక్షలను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో చిన్నారెడ్డి, సూగూరు మాజీ సర్పంచ్ రాజశేఖర్‌గౌడ్, మహాదేవ్‌గౌడ్, రవీందర్‌గౌడ్, దామోదర్‌గౌడ్ తదితరులు కృతజ్ఞతలను తెలిపారు.

పాఠశాల తనిఖీ

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని కిష్టగిరిలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ రాఘవ ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. పాఠశాలకు విద్యార్థులందరూ హాజరయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మదన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ధ్వజస్తంభ పూజ



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాల 3వ సెంటర్‌లో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బొడ్రాయి, ధ్వజస్తంభ వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో గోవింద నామస్మరణతో మార్మోగింది. భక్తులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతేక పూజలు చేశారు.

ఇసుక డంపులు సీజ్



పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో అనుమతులు లేకుండా నిల్వ చేసిన 14 ట్రిప్పుల ఇసుక డంపులను సోమవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ సుభాష్‌నాయుడు తెలిపారు. గ్రామంలో ఇసుక డంపులు నిల్వ చేశారనే సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి తనిఖీలు నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన వెంకటయ్య ప్రభుత్వ అనుమతులు లేకుండా పంట పొలంలో 14 ట్రిప్పుల ఇసుకను నిల్వ చేసుకోవడంతో వాటిని సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో చాలా మంది బీసీ ప్లాట్లలో ఇంటి నిర్మాణాల కోసం నిల్వ చేసుకున్నారన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసిన, నిల్వ చేసిన చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ మహేష్, హెచ్‌సీ రోషయ్య, వర్మ పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



గుంటిపల్లిలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



పెబ్బేరు ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న కృష్ణసాగర్

పెబ్బేరు రూరల్: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని వనపర్తి జిల్లా సాగర్ స్నేక్స్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్ అన్నారు. సాగర్ స్నేక్స్ సొసైటీ ఆధ్వర్యంలో కృష్ణసాగర్ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టారు. సోమవారం సాయంత్రం పాదయాత్ర పెబ్బేరు చేరుకుంది. వారికి షిరిడి సాయిబాబా, అయ్యప్ప ఆలయ కమిటీ, అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కృష్ణసాగర్‌ను శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు సాయిబాబా ఆలయ పార్కులో కొబ్బరి, మామిడి మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు వడ్డె ఈశ్వర్, గొడుగు బాలవర్ధన్, మేకల ఎల్లయ్య, మేకల నాగరాజు, వెంకటేశ్వర్ రెడ్డి, హనుమంతరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కిషోర్, బుచ్చయ్యశెట్టి, జయప్రకాష్‌శెట్టి, అమర్ కళ్యాణ్‌గౌడ్, అనిల్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టిన సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం కృష్ణసాగర్‌తో కలిసి మర్రికుంటలో మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని హితవు పలికారు. కార్యక్రమంలో కవి జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, గంధం నాగరాజు, నిరంజనయ్య, బండారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని హెచ్‌ఎం వగ్గు ఉమాశంకర్, సీఆర్పీ సౌమ్యరాణి తెలిపారు. సోమవారం మండలంలోని గుంటిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏకోక్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే విద్యార్థులతో మొక్కలు నాటించి పర్యావరణానికి కలిగే మేలు గురించి, నీటిని పొదుపుగా వాడుకోవడం, వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత తదితర విషయాల గురించి అవగాహన కల్పించారు.

ప్రాథమిక విద్యపై అవగాహన అవసరం

ఖిల్లాఘనపురం: పూర్వ ప్రాథమిక విద్యపై ప్రతి అంగన్‌వాడీ టీచర్ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదమ్మ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు రెండు రోజులుగా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. చిన్నారులకు సులభంగా ఎలాంటి విద్యను అందించాలనే విషయాలను వీడియోల ద్వారా ప్రత్యక్షంగా చూయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు అంగన్‌వాడీ కేంద్రాలను వచ్చే చిన్నారులకు నూతన జాతీయ విద్యా విధానంలో సూచించిన విధంగా బోధన అందించాలన్నారు. 3 నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ఆట, పాటలతో మెరుగైన విద్యనందించాలని చెప్పారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



రేకుల షెడ్డులో విద్యార్థులను గుంపుగా కూర్చోబెట్టిన యాజమాన్యం

ఖిల్లాఘనపురం: రూ.వేలు ఫీజు రూపంలో వసూలు చేస్తూ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించని ప్రైవేట్ పాఠశాలలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పలు ప్రైవేటు పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని గౌతమ్ కాన్సెప్ట్ పాఠశాలలో విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. ఒక్కో చిన్న రేకుల తరగతి గదిలో 35 నుంచి 40 మంది వరకు విద్యార్థులను కూర్చోబెట్టడంపై అసహనం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, మూత్రశాలల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగిన స్థాయిలో వసతులు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి పాఠశాలలను ఉన్నతాధికారులు పరిశీలించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే విద్యార్థి యూనియన్ల ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల పక్షాన నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఆలయ భూముల్లో అక్రమ కట్టడాలు

- నిర్ధారించిన అధికారులు
- 10 శాతం ప్లాట్లు, ఆలయ భూముల పరిశీలన



పరమేశ్వరస్వామి చెరువు భూమిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ఆత్మకూర్: వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన భూముల్లో అక్రమ కట్టడాలు, వెంచర్లలో మున్సిపాలిటీకి కేటాయించిన పదిశాతం ప్లాట్లల్లో కబ్జాలను అధికారులు నిర్ధారించారు. సోమవారం తహసీల్దార్ రాజు, పురకమిషనర్ నాగరాజు బృందం ఆలయ, 10 శాతం భూములను పరిశీలించారు. ఆత్మకూర్ శివారులోని సర్వే నంబర్లు 430, 439, 441లలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన 42.25 ఎకరాల స్థలం ఉందని.. సోమవారం పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించగా ఒక ఎకరాకు పైగా కబ్జాకు గురైనట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం కబ్జాకు గురైన స్థలంలో అక్రమంగా కట్టడాలు వెలిశాయని, వివరాలను సేకరించినట్లు తెలిపారు. అలాగే పరమేశ్వరస్వామి చెరువు శిఖం భూమిలో అక్రమంగా ఎనిమిది దుకాణ సముదాయాలను నిర్మించినట్లు సర్వే అనంతరం గుర్తించామని వివరించారు. వేంకటేశ్వరస్వామి ఆలయం, వివిధ వెంచర్ల ద్వారా కేటాయించిన 10 శాతం ప్లాట్లు, పరమేశ్వరస్వామి చెరువు శిఖం భూముల్లో అన్యాక్రాంతాలను గుర్తించి జిల్లా కలెక్టర్‌కు నివేదించామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయమ్మ, సర్వేయర్ మన్యం, పురపాలిక సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న అఖిల పక్ష నాయకులు

పెబ్బేరు రూరల్: వనపర్తి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్ పాల్గొని కలెక్టర్ ఆదర్శ్‌సురభికి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని పలు సమస్యలపై కలెక్టర్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని, మాజీ ఎమ్మెల్యే జయరాములు పేరుపై ఉన్న ప్రభుత్వ అతిథి గృహాన్ని, పాత బస్టాండ్‌ను పునఃప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, కొత్తగొల్ల శంకర్, శివకుమార్, చందు, అశ్విని రమేష్ అంజి, ఆనంద్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



మాట్లాడుతున్న విద్యాసాగర్‌రెడ్డి

పాన్‌గల్: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెల్లరాళ్లపల్లితండా ప్రత్యేకాధికారి, పీఆర్ ఏఈ విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలోని పంచాయతీ భవనంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలో తాగునీరు, విద్యుత్, వైద్యం, విద్య, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తండాలో పంచాయతీ భవనం నిర్మించినా.. బిల్లులు మంజూరు కాలేదని, గిరిజన కార్పొరేషన్‌కు ఎంపికైన లబ్ధిదారులకు రుణాలు మంజూరులో జాప్యం, పంచాయతీ కార్మికుల వేతనాలపై గ్రామసభలో తండావాసులు అధికారులను ప్రశ్నించారు. గ్రామసభలో తీర్మానం చేసిన అంశాలను ఆయా శాఖల అధికారులకు పంపాలని కోరారు. గ్రామసభకు అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ శాంతమ్మ, మహిళ సంఘం గ్రామ అధ్యక్షురాలు చిట్టెమ్మ, పంచాయతీ కార్యదర్శి నర్మద, తండావాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ ఫలాలు



విద్యార్థినికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, తహసీల్దార్ అబ్రహంలింకన్, ఎంపీడీఓ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగన్న, వడ్డె కృష్ణ, జగదీశ్, హనుమాన్‌రావు, శేఖర్‌రెడ్డి, నాగన్నయాదవ్, ఎంపీటీసీ కురుమయ్య ఉన్నారు

జెండా ఆవిష్కరణ

మండలంలోని తిరుమలాయపల్లిలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, పనిచేసిన కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోతుగంటి రాములు, పటేల్ సాయన్న, రాములు, శాంతన్న, శేషన్న, కొన్నూరు శ్రీను పాల్గొన్నారు

విద్యార్థినికి ఆర్థికసాయం

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రానికి చెందిన భీమా మాధురి సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో వైద్య విద్య రెండో సంవత్సరం చదువుతోంది. మాధురి తండ్రి భీమా ఆంజనేయులు రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. చదువు కోసం పెద్ద మొత్తంలో ఖర్చవుతుండటంతో స్థానిక ఆర్యవైశ్య నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని కలిసి మాధురి కుటుంబ ఆర్థిక పరిస్థితులను వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన వంతు సాయంగా రూ.50వేలు అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో భీమా చంద్రకాంత్, శంకరశెట్టి, మెడిశెట్టి రాజు తదితరులు ఉన్నారు.

కురుమూర్తి లిఫ్ట్ అధ్యక్షుడిగా రాజవర్ధన్ రెడ్డి

మదనాపురం: మండలంలోని దుప్పల్లి, కొత్తపల్లి, అమ్మాపూర్, కురుమూర్తి గ్రామాలకు సాగునీరు అందించే కురుమూర్తి రాయ ఎత్తిపోతల పథకం చైర్మన్‌గా సోమవారం మల్లేపల్లి రాజవర్ధన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆయనను శాలువాతో సన్మానించి అభినందించారు.

ఆస్పత్రిని వినియోగంలోకి తీసుకురావాలి



ఎన్ఆర్ఐ నిర్మించిన పది పడకల ఆస్పత్రి భవనం

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో ఎన్ఆర్ఐ డా.సురేఖ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పేదల కోసం ఆగుసాల లక్ష్మీదేవి ఫౌండేషన్ ద్వారా నిర్మించి ప్రభుత్వానికి అప్పగించిన 10 పడకల ఆస్పత్రిని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.80 లక్షలు ఖర్చు చేసి గ్రామంలో 10 పడకల ఆస్పత్రి, ఒక అంబులెన్స్ ఏర్పాటు చేసి గతేడాది డిసెంబర్‌లో ప్రారంభించి, సేవలు అందించేలా తగు ఏర్పాటు చేయాలని ఆమె ప్రభుత్వానికి అప్పగించారు. ఆస్పత్రి నిర్మాణంతో గ్రామంతో పాటు చుట్టూ ప్రక్క గ్రామాల ప్రజలకు కూడా మెరుగైన వైద్యం అందుతుందని ఆమె నమ్మారు. ఆస్పత్రి ప్రారంభించి నెలలు గడుస్తున్నా నేటికీ అక్కడ వైద్యులు, సిబ్బందిని ప్రభుత్వం నియమించకపోవడంతో ఆస్పత్రి నిరుపయోగంగానే ఉంది. ఆస్పత్రిని వినియోగంలోకి తీసుకరావాలని గ్రామానికి చెందిన యువత కూడా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఎన్ఆర్ఐ ఏర్పాటు చేసిన ఆస్పత్రిని వినియోగంలోకి తీసుకరావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లలో సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మదనాపురం: మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇళ్లలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకట్రాములు ఆధ్వర్యంలో ఇళ్లలో ఉంటున్న ప్రజలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించి 8 నెలలు పూర్తి కావస్తున్నా.. వసతులు లేక సతమతం అవుతున్నారని, తాగునీటి వసతి లేదని దుయ్యబట్టారు. బాత్రూంలోని నీళ్లు బయట రోడ్లపై పారుతుందన్నారు. డ్రెయినేజీలు లేకపోవడంతో కాలనీ వాళ్లు బురదలో నడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దోమల బెడద ఎక్కువై రోగాలు ప్రబలుతున్నాయన్నారు. అనంతరం తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ పుష్పకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో చీర్ల ప్రసాద్, వెంకటేష్, చెన్నయ్య, డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రజలు పాల్గొన్నారు.